సాక్షి
పల్నాడు
సోమవారం, 22, జూలై, 2024



ముత్యాలమ్మ బోనాలు

రెంటచింతల: ఆషాఢ మాసం సందర్భంగా ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో బోనాలను సమర్పించారు.



సాగర్‌లో భక్తుల సందడి

విజయపురిసౌత్: సాగరమాత ఆలయానికి ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. దివ్యబలిపూజ, తేరు ప్రదక్షిణ నిర్వహించారు.



హెల్మెట్ ధరించండి

పిడుగురాళ్ల: హెల్మెట్ ధారణపై పిడుగురాళ్లలో ఆదివారం వాహన చోదకులకు న్యాయ విజ్ఞాన సదస్సు ఆధ్వర్యాన అవగాహన కల్పించారు.

చిగురించిన ఆశలు

- ఇటు వానలు, అటు డ్యాముల్లో చేరుతున్న వరద నీరు
- సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదు
- మరోవైపు ఎగువన పరుగులు తీస్తున్న కృష్ణమ్మ
- శ్రీశైలం జలాశయంలోకి మొదలైన వరద రాక
- వచ్చే నెలలో సాగర్ కుడి కాలువ నీటి విడుదలపై ఆశలు
- జిల్లాలో ఇప్పటివరకు అరకొరగా ఖరీఫ్ సాగు
- పరిస్థితి మెరుగుతో భారీగా మిర్చి విత్తనాల కొనుగోలు
- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2,48,350 హెక్టార్లు

ఖరీఫ్‌పై అన్నదాతల్లో పెరిగిన ధీమా



దుర్గి మండలంలో సాగు చేసిన పత్తి పంట

సాక్షి, నరసరావుపేట: జిల్లాలో ఏడు రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో అన్నదాతల్లో ఆనందం నెలకొంది. ఖరీఫ్ ప్రారంభమైన జూన్ నెలలో అనుకున్నంతగా అన్ని మండలాల్లో వర్షాలు పడకపోవడం, ఉమ్మడి గుంటూరు జిల్లా సాగు, తాగునీటి అవసరాలు తీర్చే కృష్ణమ్మ పరవళ్లు మొదలు కాకపోవడంతో ఇప్పటి వరకు సాగు పనులు ముందుకు కదల్లేదు. ఈ ఏడాది పల్నాడు జిల్లా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2,48,350 హెక్టార్లు. కానీ ఇప్పటి వరకు కనీసం 10 శాతం కూడా సాగు కాకపోవడం ఆందోళన రేకెత్తించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో దాదాపుగా అన్ని ప్రాంతాల్లో సాగు ప్రారంభానికి సరిపడా వర్షాలు పడుతుండటం రైతన్నల్లో ధీమా పెంచింది. ఖరీఫ్‌లో జూన్ నెలలో 27.6 శాతం, జూలై నెలలో సుమారు 30 శాతానికి పైగా అధిక వర్షపాతం నమోదైంది. మరోవైపు ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కడం ఖరీఫ్ సాగుకు శుభసూచికంగా కనిపిస్తోంది. ఆగస్టు నెలలో సాగర్ కుడి కాలువ నుంచి నీరు విడుదలైతే ఇక పంటలకు ఏ ఇబ్బందీ ఉండదన్న విశ్వాసం రైతన్నల్లో నెలకొంది.

కృష్ణానదిపై ఉన్న ప్రధాన జలాశయాలలో నీటి వివరాలు...

జలాశయం	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
	(టీఎంసీలు)		(క్యూసెక్కుల్లో)	
శ్రీశైలం	215.81	39.14	65,172	876
నాగార్జున సాగర్	312.05	122.52	2,340	9,882
పులిచింతల	45.77	0.84	416	50
ప్రకాశం బ్యారేజ్	3.07	3.07	8,275	7,453
ఎగువ రాష్ట్రాలలోని ముఖ్యమైన డ్యాముల్లో పరిస్థితి...				
ఆల్మట్టి	129.72	100.13	87,217	1,00,064
జూరాల	9.66	7.04	79,166	84,444
నారాయణపూర్	37.64	33.21	96,063	1,08,628
తుంగభద్ర	100.86	74.58	1,12,101	4,341

శ్రీశైలం చేరుతున్న వరద నీరు...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో కాలువలు, ఎత్తిపోతల పథకాల ఆధారంగా అధిక శాతం సాగు చేస్తున్నారు. కృష్ణానదిపై ఉన్న నాగార్జున సాగర్ జలాశయం ద్వారా వ్యవసాయానికి నీరు అందుతోంది. సాగర్ నీటి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 122.52 టీఎంసీలే ఉంది. డెడ్ స్టోరేజీ అయిన 131.669 టీఎంసీల కన్నా ఇది తక్కువే. డ్యాం నిండాలంటే సుమారు 189.53 టీఎంసీలు నీరు కావాలి. సాగర్‌కు ఎగువ నుంచి వరదనీరు వచ్చే శ్రీశైలం ప్రాజెక్టులోనూ వారం క్రితం ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరదనీరు భారీగా చేరడం శుభసూచికంగా చూడొచ్చు. పూర్తి స్థాయి నీటి మట్టం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 39.14 టీఎంసీలే ఉంది. శ్రీశైలం నిండాలంటే మరో 176.66 టీఎంసీలు అవసరం. ఆదివారం ఉదయం నాటికి శ్రీశైలానికి 65,172 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం ఎగువ నుంచి వస్తున్న వరదనీరు ఇలాగే కొనసాగితే ఆగస్టు నెల రెండో వారంలోపు శ్రీశైలం డ్యాం గేట్లు ఎత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఎగువ రాష్ట్రాలలో పరిస్థితి ఆశావహం

కృష్ణానదిపై ఉన్న ఎగువ రాష్ట్రాలలోని జలాశయాలన్నీ దాదాపుగా కళకళలాడుతున్నాయి. ప్రధానంగా ఆల్మట్టిలో 100, జూరాలలో 7.04, నారాయణపూర్‌లో 33.21, తుంగభద్రలో 74.58 టీఎంసీల నీరు ఉంది. వీటికి ఇన్‌ఫ్లో భారీగా ఉండటంతో ఇకపై కురిసే వానలకు దిగువన ఉన్న శ్రీశైలం, సాగర్‌లకు వరదనీరు భారీగా రానుంది.

ఇప్పుడు భరోసా వచ్చింది..



నాకు 5 ఎకరాల పొలం ఉంది. ఖరీఫ్ ప్రారంభంలో కొంతమేరకు వర్షాలు తక్కువగా ఉండటం, ప్రాజెక్టులలో నీరు లేకపోవడంతో సాగుకు వెనుకడుగు వేసి కాస్త ఆలోచించా. నాతోపాటు ఈ ప్రాంత రైతులు పలువురు ఖరీఫ్ సాగుకు ఆసక్తి చూపలేదు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు, శ్రీశైలానికి భారీగా వరద వస్తుండటంతో ఆశలు పెరిగాయి. నా ఐదు ఎకరాల్లో మిర్చి, పత్తి పంట సాగు చేస్తున్నాను.

– నంద్యాల వెంకటరెడ్డి, రైతు, కామేపల్లి, పిడుగురాళ్ల మండలం

మొదలైన సాగు పనులు...

కురుస్తున్న వర్షాలు, జలాశయాలలో చేరుతున్న నీరు ఎక్కువగా ఉండటంతో రైతులు సాగు పనులకు ముందుకు వస్తున్నారు. దీంతో విత్తన మార్కెట్ పుంజుకుంది. ఆగస్టు నెలలో నీరు విడుదల అవుతుందన్న అంచనా నేపథ్యంలో మిర్చి నర్సరీలలో నారు పెంచడానికి యజమానులు ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పటికే అన్నదాతలు కూడా మిర్చి విత్తనాలు భారీగా కొనుగోలు చేశారు. వరి నారు పనులు కూడా పలువురు రైతులు మొదలు పెట్టారు.

రషీద్‌ది ముమ్మాటికీ రాజకీయ హత్యే

- టీడీపీ తాజా, మాజీ ఎమ్మెల్యేల ప్రోత్సాహంతోనే దురాగతం
- మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం



నగరంపాలెం(గుంటూరువెస్ట్): ఇటీవల పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీ కార్యకర్త చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. గుంటూరు విద్యానగర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో రాంబాబు మాట్లాడారు. ''ఇది రాజకీయ హత్యకాదు.. ఇద్దరు మిత్రుల మధ్య తలెత్తిన విభేదాల వల్ల జరిగిన హత్య'' అని పోలీసులు, ప్రభుత్వం మాట్లాడటం దారుణమని మండిపడ్డారు. నిందితుడు జిలానీ ప్రస్తుతం టీడీపీలో ఉన్నాడని తెలిపారు. మంత్రులు పార్థసారథి, ఆనం రామనారాయణరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తరహాలోనే జిలానీ టీడీపీలోకి వెళ్లాడని ఎద్దేవా చేశారు. ఆ పార్టీలోకి వెళ్లాక వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ప్రోద్బలంతో రషీద్‌ను హత్య చేశాడని స్పష్టం చేశారు. రషీద్‌కు నేరచరిత్ర లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తే టీడీపీ తట్టుకోలేకపోయిందని అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. రషీద్ హత్య వ్యక్తిగతమైతే అతని కుటుంబాన్ని ఎమ్మెల్యే, ఎంపీ ఇప్పటి వరకు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్‌లోనూ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులపై రషీద్ కుటుంబ సభ్యులు ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. ఈ హత్య గంజాయి మత్తులో జరిగిందని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారం చేపట్టి 45 రోజులవుతుందని, గంజాయిపై పోలీస్ వ్యవస్థ ఏం చేస్తోందని, రాష్ట్రంలో గంజాయి ఉందని హోంమంత్రి అంగీకరించినట్లేనా అని ప్రశ్నించారు.

న్యూస్‌రీల్

అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు



శావల్యాపురం: సాగర్ జలాశయం నుంచి మండలంలోని గంటావారిపాలెం సమీపాన ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల అయినట్లు ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు ఆదివారం తెలిపారు. సాగర్ నీటి మట్టం 505 అడుగులుగా ఉందని డీఈ చెప్పారు. తాగునీటి అవసరాల నిమిత్తం 5,500 క్యూసెక్కులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఉన్న మంచినీటి చెరువులను ఎన్నెస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమన్వయంతో నూరు శాతం నింపేలా చర్యలు చేపట్టామన్నారు. నీటిని ప్రజలు వృథా చేయొద్దని కోరారు. వారం పాటు సాగర్ జలాలు విడుదల అవుతాయన్నారు. చేపల చెరువులు, పొలాలకు నీటిని వినియోగించరాదని, అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 700 క్యూసెక్కులు విడుదల చేసినట్లు తెలిపారు.

కలుషిత ఆహారంతో నలుగురికి అస్వస్థత




దగ్గుబాడు (కారంచేడు): కలుషిత ఆహారం తిని నలుగురు వ్యక్తులు అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం మండలంలోని దగ్గుబాడు ముస్లిం కాలనీలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని, సుహానా దంపతులకు షాహిద్, ఫాతిమా అనే పిల్లలున్నారు. వీరంతా శనివారం రాత్రి ఇంట్లో వండిన వంకాయ కూరతో అన్నం తిన్నారు. ఆదివారం ఉదయం లేచిన తరువాత దోశలు తిన్నారు. వీటిలో ఏ ఆహారం కలుషితమైందో తెలియదు గానీ అనంతరం వాంతులు, విరేచనాలతో నలుగురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో గ్రామస్తులు చీరాలకు చెందిన ఓ ఆస్పత్రి గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి తీసుకెళ్లారు. డాక్టర్ పృథ్వీ పరీక్షలు నిర్వహించి, ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం వారిని ఇంకొల్లుకు పంపించినట్లు గ్రామస్తులు తెలిపారు.

అసెంబ్లీ సమావేశాల బందోబస్తు పరిశీలన



తాడికొండ: సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సచివాలయం, అసెంబ్లీ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు వచ్చే మార్గాలలో ఎటువంటి ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్య ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వెలగపూడి సచివాలయం, పరిసర ప్రాంతాల్లో అధికారులతో కలిసి హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి అధికారి, సిబ్బంది అలసత్వం లేకుండా సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ కే శ్రీనివాసరావు, క్రైం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, తూళ్లూరు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, ఏఆర్ డీఎస్పీ శ్రీ శాంత కుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్నస్వామి, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆనంద్, సీఐలు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 504.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,700, ఎడమ కాలువకు 3,146, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

మెడికల్ షాపులో అగ్ని ప్రమాదం

సుమారు రూ.40 లక్షల ఆస్తి నష్టం

పిడుగురాళ్ల : ఓ మెడికల్ షాపులో అగ్ని ప్రమాదం సంభవించి భారీగా ఆస్తినష్టం వాటిల్లిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో చోటు చేసుకుంది. జానపాడు గ్రామానికి చెందిన మణి అనే వ్యక్తి పిడుగురాళ్ల పట్టణంలోని ఉన్నం హాస్పిటల్ ఎదురుగా సాయి మెడికల్స్ పేరిట షాపు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం తాళాలు వేసి వెళ్లగా.. ఆదివారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో అగ్నిప్రమాదం విషయమై ఆసుపత్రి సిబ్బంది ఆయనకు సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారొచ్చేసరికి లోపల ఉన్న ఔషధాలు తదితర సుమారు రూ. 40 లక్షల విలువైన సామగ్రి దగ్ధం అయినట్లు మణి తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దుకాణంలో ఎగిసిపడుతున్న మంటలు

ఘనంగా గురుపౌర్ణమి



హిమాలయ గురూజీ సమక్షంలో వితంరాజుపల్లిలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు

గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం జిల్లాలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ప్రధానంగా సాయిబాబా మందిరాల్లో రద్దీ కనిపించింది. ఆలయ నిర్వాహకులు వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానాలు నిర్వహించారు. హిమాలయ గురూజీ సమక్షంలో వితంరాజుపల్లిలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చల్లగుండ్ల సున్నపుబట్టీ వద్ద కొలువుదీరిన ఆలయంలో సాయిబాబాకు విశేష అలంకరణ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్




చల్లగుండ్ల సున్నపుబట్టీ వద్ద మందిరంలో అలంకరణలో బాబా

శాకంబరీ.. శరణు శరణు..



సత్తెనపల్లిలో నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారికి సమర్పించడానికి బోనాలతో వెళుతున్న మహిళలు

అమరావతి: ఆషాఢ మాసం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శాకంబరీ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని శాకంబరీదేవిగా నేత్రపర్వంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అంతా మంచి జరగాలని శరణు కోరుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారు శాకంబరీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని అన్ని రకాల కూరగాయలతో ఎంతో ఆకర్షణీయంగా అలంకరించారు. లోక కల్యాణార్థం పాడి పంటలతో రైతులంతా సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ఇలా అలంకరించామని ఈవో వేమూరి గోపీనాథశర్మ తెలిపారు. అలాగే ఆలయంలోని జ్వాలాముఖిదేవి అమ్మవారికి కూడా శాకంబరీదేవిగా అలంకరణ చేశారు. తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



శాకంబరీదేవి అలంకరణలో బాల చాముండేశ్వరీ దేవి

ఘర్షణలకు దూరంగా ఉండండి

- జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచన
- సమస్యాత్మక గ్రామాల్లో పర్యటన

వెల్దుర్తి : మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన గుండ్లపాడు, కొత్తపుల్లారెడ్డి గూడెంలలో పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదివారం ఆకస్మికంగా పర్యటించారు.

ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ఎలాంటి ఘర్షణలు పడొద్దని, ప్రశాంతంగా జీవించాలన్నారు. గొడవలతో కుటుంబాలు నష్టపోతాయని, అందరూ కలిసి మెలిసి సోదరభావంతో జీవించాలని సూచించారు. గ్రామాలు, కుటుంబాలు అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులకు పంపాలని పేర్కొన్నారు. ఘర్షణల వల్ల బంధుత్వాలు దూరమై ఒకే గ్రామంలో ఉంటూ పరస్పరం కక్షలు పెంచుకుంటూ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారని గుర్తుచేశారు. కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా, మానసికంగా కూడా నష్టపోతున్నట్లు తెలిపారు. సోదరభావంతో అందరూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట గురజాల డీఎస్పీ శ్రీనివాసరావు, మాచర్ల రూరల్ సీఐ కె.సురేష్, ఎస్‌బీ సీఐ సురేష్, వెల్దుర్తి ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది, స్థానికులున్నారు.



గుండ్లపాడులో ప్రజలతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు

గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం

పిడుగురాళ్ల: గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతామని పల్నాడు జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్‌లోని రికార్డులు, లాకప్, టెక్నికల్ రూమ్‌తోపాటు పరిసరాలను పరిశీలించారు. ఫిర్యాదు చేయటానికి వచ్చిన వారి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి విధుల గురించి సూచనలు, సలహాలు అందించారు. ప్రధానంగా పిడుగురాళ్ల పట్టణం, పరిసర ప్రాంతాల్లో గంజాయి మత్తులో యువత జీవితం నాశనం చేసుకుంటున్నారని, లాటరీల వంటి వాటిని అదుపు చేసేందుకు చర్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. ప్రత్యేక బలగాలతో నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. లాటరీలు, పేకాట వంటి వాటిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఫిర్యాదు నిమిత్తం స్టేషన్‌కు వచ్చిన వారితో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని పట్టణ సీఐ ఎస్. వెంకట్రావుకు సూచించారు.

క్లుప్తంగా

మంత్రి అనగానితో దర్శకుడు దిలీప్‌రాజా భేటీ



నగరంపాలెం(గుంటూరు వెస్ట్‌): ఆంధ్రాలో షూటింగ్‌లు చేసే సినిమాల రెవెన్యూ తెలంగాణకు వెళ్లకుండా యుద్ధప్రతిపాదికపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరినట్లు దర్శకుడు, మా–ఏపీ వ్యవస్థాపకులు దిలీప్‌ రాజా తెలిపారు. గుంటూరు కన్నవారితోటలోని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నివాసంలో ఆదివారం రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను దిలీప్‌ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సినీ పరిశ్రమ అభివృద్ధిపై మంత్రితో చర్చించినట్లు ఆయన వెల్లడించారు.

ప్రియుడి మోజులో చిన్నారులకు తల్లి వేధింపులు

మాచర్ల రూరల్‌: ప్రియుడి మోజులో పడి తల్లి పెడుతున్న వేధింపులు తాళలేక తిరుపతి నుంచి పారిపోయి వచ్చిన చిన్నారులు చివరికి పల్నాడు జిల్లా మాచర్ల రూరల్‌ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. మాచర్ల రూరల్‌ ఎస్‌ఐ కె. రాజశేఖర్‌ తెలిపిన వివరాల మేరకు... మాచర్ల రూరల్‌ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహేష్‌, సాగరమ్మలకు కుమార్తె (11), కుమారుడు (8) సంతానం. సాగరమ్మ మాచర్ల పట్టణానికి చెందిన మల్లెల షఫీతో తిరుపతిలో సహజీవనం చేస్తోంది. మల్లెల షఫీ గతంలో ట్రాన్స్‌జెండర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుని కొంత నగదు కాజేసినట్లు ఆరోపణలున్నాయి. షఫీ మద్యం తాగి వచ్చినప్పుడు సాగరమ్మతో కలిసి తరచూ చిన్నారులను తమకు అడ్డుగా ఉన్నారని వేధించేవాడు. తట్టుకోలేక చిన్నారులు శుక్రవారం తిరుపతిలో రైలు ఎక్కి శనివారం ఉదయం గుంటూరు చేరుకున్నారు. అక్కడి రైల్వేస్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే బంధువుల సాయంతో తండ్రికి సమాచారం అందించారు. తండ్రి తన చిన్నారులను తీసుకొని స్వగ్రామం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో సాగరమ్మ చిన్నారుల మిస్సింగ్‌పై తిరుపతి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్వగ్రామం చేరుకుంటారని ఆమె అనుమానం వ్యక్తం చేయడంతో తిరుపతి పోలీసుల సమాచారం మేరకు రూరల్‌ ఎస్‌ఐ రాజశేఖర్‌ ఆ చిన్నారులను పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. షఫీకి మద్దతుగా ట్రాన్స్‌జెండర్లు పెద్ద ఎత్తున స్టేషన్‌ వద్దకు చేరుకొని గందరగోళం సృష్టించారు. కుటుంబసభ్యుల సమక్షంలో సాగరమ్మకు కౌన్సెలింగ్‌ నిర్వహించిన పోలీసులు మహేష్‌తో కలిపారు. అనంతరం దంపతులకు పిల్లలను అప్పగించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి భరోసా
- వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: కార్యకర్తలు, నాయకులకు తనతోపాటు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్‌ సీపీ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. గ్రామాలవారీగా నాయకులతో సుదీర్ఘంగా మాట్లాడి గ్రామాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి, ధైర్యం చెప్పారు. టీడీపీ నాయకుల దాడులను ప్రస్తావిస్తూ గ్రామాలు విడిచి ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి వివరాలను కూడా తెలుసుకున్నారు. వారితో ఫోన్‌లో సంభాషించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకి సముచిత న్యాయం చేసి అండగా ఉంటామని చెప్పారు. ఏ సమస్య వచ్చినా తనతోపాటుగా పార్టీ కూడా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి సమర్థంగా పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. మండల స్థాయి నాయకత్వం, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులతో మాట్లాడాలని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తాను కూడా ప్రతి గ్రామానికి వచ్చి శ్రేణులను కలుస్తానని తెలిపారు. కాసు వెంట పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్‌ సుభానీ, ఎంపీపీ కందుల జాను, వైస్‌ ఎంపీపీ తండా అబ్దుల్‌ సత్తార్‌, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, నాయకులు కొప్పుల సాంబయ్య, మందపాటి రమేష్‌ రెడ్డి, షేక్‌ జాకీర్‌హుస్సేన్‌, కుందురు తిరుపతిరెడ్డి, షేక్‌ సైదా, కొలా జంపాలరెడ్డి, షేక్‌ ఖాదర్‌భాషా, కొమెర బత్తిన విజయ్‌కుమార్‌, మునగా శ్రీనివాసరావు, జంగాల సింగరయ్య యాదవ్‌, నాళం శ్రీనివాసరావు, మోమిన్‌ నాగుల్‌మీరా, బొమ్మిరెడ్డి నరసింహారావు, చాప శేషయ్య తదితరులున్నారు.

అద్భుతాలను ఊహించొద్దు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌



సభలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్‌

పొన్నూరు: సాధ్యమైనంత వరకే తమ శాఖలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని, అద్భుతాలు జరుగుతాయని మాత్రం ఊహించవద్దని కేంద్ర గ్రామాణాభివృద్ధి, సమాచార శాఖ సహాయమంత్రి డాక్టర్‌. పెమ్మసాని చంద్రశేఖర్‌ అన్నారు. ఆదివారం మండలంలోని కట్టెంపూడి, దండమూడి మీదుగా మామిళ్లపల్లి గ్రామం వరకు పీఎంజీఎస్‌వై నిధులు రూ. 5 కోట్ల 19 లక్షలతో నిర్మించనున్న రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కట్టెంపూడి గ్రామ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో కేంద్ర సహాయ మంత్రి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. రోడ్లు కంటే ఇళ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కొన్ని కంపెనీలతో మాట్లాడితే రాష్ట్ర పరిస్థితి బాగోలేదని, ఇక్కడకు రాలేమని చెప్పారని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక టీడీపీ ప్రభుత్వం పతనమవుతుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఓ కార్యకర్త ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఖండించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌, కూటమి నాయకులు వడ్రాణం మార్కండేయబాబు, డేగల ప్రభాకర్‌, అధికారులు పాల్గొన్నారు.

కొల్లిపరలో 12.2 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 12.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.8 మి.మీ వాన కురిసింది. సగటున 4.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. ప్రత్తిపాడు 7.4, దుగ్గిరాల 6.8, తుళ్ళూరు 5.2, చేబ్రోలు 5, మేడికొండూరు 4.8, పొన్నూరు 4, ఫిరంగిపురం 3.8, తాడేపల్లి 3.6, మంగళగిరి 3, పెదకాకాని 3, వట్టిచెరుకూరు 3, తెనాలి 3, పెదనందిపాడు 2.6, గుంటూరు పశ్చిమ 2.4, తాడికొండ 2.2, కాకుమాను మండలంలో 2 మి.మీ చొప్పున వర్షం పడింది. జూలై 21 నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 111.2 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 188.1 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పెన్షనర్లకు పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్‌: పెన్షనర్లకు 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు డిమాండ్‌ చేశారు. గుంటూరు బ్రాడీపేట తాలూకా ప్రాంగణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్సీలో తగ్గించిన అదనపు క్వాంటమ్‌ను పునరుద్ధరించుకోవడంతో పాటు బకాయిలను సాధించుకునేందుకు జేఏసీతో కలసి కృషి చేస్తామని తెలిపారు. సంఘ పటిష్టతకు జిల్లా శాఖలు, తాలూకా యూనిట్లు కృషి చేయాలని అన్నారు. సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు జీఎస్‌ అబ్దుల్‌ కరీం మాట్లాడుతూ యూనిట్ల పటిష్టతకు కృషి చేయడంతో పాటు పెన్షనర్లు సమాజసేవ చేయాలని సూచించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు మాట్లాడుతూ పెన్షనర్లకు హెల్త్‌కార్డులపై అన్ని ఆస్పత్రుల్లో అన్ని రకాల జబ్బులకు నగదు రహిత చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మెడికల్‌ రీయింబర్స్‌మెంట్‌ పరిమితిని రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్‌ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులందరూ సంఘంలో సభ్యులుగా చేరాలని అన్నారు. సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.పెద్దన్న గౌడ్‌ మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్‌ను పూర్తి అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈహెచ్‌ఎస్‌కు బదులు కార్పొరేషన్‌ ఏర్పాటు చేసి, రూ.వెయ్యికోట్లతో నిధిని ఏర్పాటు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

కోళ్లూరు ప్రసన్నాంజనేయ ఆలయాభివృద్ధికి కృషి

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



విలేకరుల సమావేశంలో మంత్రి రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్‌

బెల్లంకొండ: తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం మండలంలోని బెల్లంకొండ క్రాస్‌ రోడ్డు వద్ద గల ఆలయంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్‌లతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ విశిష్టతను మంత్రికి కన్నా వివరించారు. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కోళ్లూరు నుంచి స్వామి వారిని 2013లో ప్రస్తుత స్థలానికి తరలించారన్నారు. స్థానికంగా బాలాలయాన్ని నిర్మించి, పూజలు చేస్తున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ ఆలయాలకు దీటుగా ప్రసన్నాంజనేయ స్వామి గుడిని నిర్మిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఇదే ప్రాంతానికి చెందిన ఢిల్లీలో పనిచేస్తున్న ఐపీఎస్‌ అధికారి సహకారం అందించడానికి ముందుకురావడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వంతోపాటు దాతలు, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యేలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ విభాగ కార్యదర్శి పీయస్కె మస్తాన్‌షరీఫ్‌, సర్పంచి ఆసుల జగన్‌, నల్లమేకల లక్ష్మీనారాయణ, సముద్రం, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బెల్లంకొండ మండలంలో అధిక వర్షపాతం

- 15.6 మి.మీ. మేర కురిసిన జోరువాన
- జిల్లావ్యాప్తంగా 160 మి.మీ.గా నమోదు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో బెల్లంకొండ మండలంలో అత్యధికంగా 15.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 28 మండలాల్లో 160 మి.మీ. వర్షపాతం కురిసింది. మండలాల వారీగా గమనిస్తే.. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 3.8 మి.మీ., మాచర్లలో 4.4, వెల్దుర్తి, యడ్లపాడు మండలాల్లో 2.2, దుర్గిలో 5.2, రెంటచింతల, అచ్చంపేట మండలాల్లో 4.6, గురజాలలో 6, దాచేపల్లిలో 12.2, కారంపూడి, బొల్లాపల్లి మండలాల్లో 6.4 మి.మీ. చొప్పున వర్షం కురిసింది. పిడుగురాళ్లలో 9.4, మాచవరంలో 1.2, క్రోసూరు, నూజెండ్ల మండలాల్లో 4.8, అమరావతిలో 6.2, పెదకూరపాడులో 4.0, సత్తెనపల్లిలో 7.6, రాజుపాలెంలో 9.2, నకరికల్లులో 10.2, వినుకొండ, ముప్పాళ్ల మండలాల్లో 4.2, శావల్యాపురంలో 7.4, ఈపూరులో 5.2, రొంపిచర్ల, చిలకలూరిపేట మండలాల్లో 2.4, నాదెండ్లలో 3.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

పేకాట శిబిరంపై పోలీసుల మెరుపుదాడి

- రూ 3,12,750 నగదుతో 24 మంది జూదరులు అరెస్ట్‌
- రెండు కార్లు, రెండు ఆటోలు, ఏడు ద్విచక్రవాహనాలు, 24 సెల్‌ ఫోన్లు స్వాధీనం



జూదరుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 24 మంది జూదరులను అరెస్ట్‌ చేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళగిరి రూరల్‌ ఎస్‌ఐ ఖాదర్‌ బాషా తెలిపిన వివరాల మేరకు కాజ పరిధిలోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా బైబిల్‌ మిషన్‌ వెనుక గల మామిడితోటలో పేకాట జరుగుతుందనే సమాచారం మేరకు పోలీసులు మెరుపుదాడిచేశారు. 24 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 3,12,750 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అలాగే రెండు కార్లు, రెండు ఆటోలు, ఏడు ద్విచక్రవాహనాలు, 24 సెల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్‌ విధించినట్లు వెల్లడించారు.

గంజాయి విక్రయ ముఠా అరెస్ట్‌

- పోలీసుల అదుపులో ముగ్గురు
- పరారీలో మరో నలుగురు
- డీఎస్పీ రమేష్‌ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్‌, పక్కన సీఐలు వెంకటేశ్వర్లు, దశరథరామారావు, ఎస్‌ఐ కోటేశ్వరరావు

తెనాలిరూరల్‌: విద్యార్థులు, యువతే లక్ష్యంగా గుంటూరు, బాపట్ల జిల్లాల్లో గంజాయి విక్రయిస్తున్న ముఠా సభ్యులు ముగ్గురిని పోలీసులు అరెస్ట్‌ చేసి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో ఏడుగురు సభ్యులుగా ఉండగా, నలుగురు పరారీలో ఉన్నారు. తెనాలి రూరల్‌ సర్కిల్‌ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.రమేష్‌ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. తెనాలి మండలం కఠెవరం గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నారని రూరల్‌ సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ పి.కోటేశ్వరరావులకు పక్కా సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన వారు సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించారు. బాపట్ల పట్టణానికి చెందిన అల్లుమోలు మణికుమర్‌రెడ్డి, విజయవాడ అజిత్‌సింగ్‌ నగర్‌లో ఉంటున్న మంగళగిరికి చెందిన తాడిశెట్టి జోసఫ్‌ అలియాస్‌ మనోహర్‌, కఠెవరానికి చెందిన 17 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కఠెవరంలో అద్దెకు ఉంటున్న షేక్‌ ఇమ్రాన్‌కు మణికుమార్‌రెడ్డి, జోసఫ్‌, బాలుడితో పరిచయమైంది. ఇమ్రాన్‌ విశాఖ జిల్లా నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న పొట్లాలు కట్టి తన స్నేహితులు ముగ్గురికి ఇచ్చి విక్రయించేందుకు పంపేవాడు. మణికుమార్‌రెడ్డికి పరిచయమున్న యర్రబాలెంకు చెందిన భార్గవ్‌ప్రశాంత్‌, మంగళగిరికి చెందిన తిరువీధుల సాయికృష్ణ, ఖగ్గా తిరుపతయ్యలకూ విక్రయించేవారు. ఈ నేపథ్యంలో శనివారం కఠెవరంలోని ఇమ్రాన్‌ గదిలో గంజాయిని పొట్లాలు కడుతుండగా పోలీసులు దాడి చేసి మణికుమార్‌రెడ్డి, జోసఫ్‌, బాలుడిని పట్టుకున్నారు. ఇమ్రాన్‌, భార్గవ్‌ప్రశాంత్‌, తిరువీధుల సాయికృష్ణ, ఖగ్గా తిరుపతయ్య పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. తెనాలి సబ్‌డివిజన్‌ డీఎస్పీగా తాను బాధ్యతలు చేపట్టిన ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు గంజాయి కేసుల్లో 50 మందిని అరెస్ట్‌ చేశామని, గంజాయి విక్రయాలు, వినియోగాన్ని సహించేది లేదని డీఎస్పీ రమేష్‌ స్పష్టం చేశారు. గంజాయి ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ కోటేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్‌ వాకా రవి, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రాము, రాజేష్‌కుమార్‌ను ఆయన అభినందించారు. సమావేశంలో వన్‌టౌన్‌ సీఐ జి. దశరథరామారావు ఉన్నారు.

స్థల వివాదంలో ఇరు వర్గాల ఘర్షణ



ఎన్నాదేవిలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాల వారు

సత్తెనపల్లి: స్థల వివాదంలో సత్తెనపల్లి మండలం ఎన్నాదేవిలో బంధువులైన ఇరువర్గాల మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. సత్తెనపల్లి రూరల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నాదేవి గ్రామంలో 117 గజాల కాలిబాటకు సంబంధించిన స్థల వివాదం సత్తెనపల్లి సీనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆదివారం ఆ స్థలంలో రమాదేవి, సుబ్బాయమ్మ తదితరులు మొక్కలు నాటడంతో ప్రత్యర్థి వర్గం ప్రశ్నించింది. మహిళల మధ్య వివాదం పెరిగి, వారి భర్తలు రంగంలోకి దిగారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మాదంశెట్టి లక్ష్మి ఫిర్యాదు మేరకు రమాదేవి, సుబ్బాయమ్మ, శంకర్‌లపై కేసు నమోదు అయింది. రాట్నాల శంకర్‌ ఫిర్యాదు మేరకు మాధంశెట్టి కొండలు, లక్ష్మి, త్రివేణి, హుస్సేన్‌ రావు, పద్మావతి, హేమలపై కౌంటర్‌ కేసు నమోదు చేసినట్లు సత్తెనపల్లి రూరల్‌ ఏఎస్‌ఐ కరీముల్లారావు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో దోపిడీకి యత్నం

కత్తితో ఆగంతకుడు దాడి

తెనాలి రూరల్‌: తెనాలి రైల్వేస్టేషన్‌లో వేచి చూస్తున్న వ్యక్తిపై గుర్తు తెలియని దుండగుడు దోపిడీకి యత్నించి కత్తితో దాడి చేసిన ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. పాండురంగపేటకు చెందిన పాతూరి రాజ మార్కెట్‌ వంతెన వద్ద కొబ్బరికాయల వ్యాపారి. శనివారం రాత్రి 12 గంటల సమయంలో వైజాగ్‌ నుంచి తన మేనల్లుడు వస్తుండటంతో అతడిని తీసుకువెళ్లేందుకు స్టేషన్‌లోని 3వ నంబర్‌ ప్లాట్‌ఫాంపై రాజ వేచి చూసర్తుండగా గుర్తు తెలియని అగంతకుడు వచ్చి మాటల్లో పెట్టాడు. జేబులోని సెల్‌ఫోన్‌ తీసుకుని పరారయ్యేందుకు యత్నించాడు. వెంటనే తేరుకున్న బాధితుడు రాజ అతడిని పట్టుకుని నిలువరించే యత్నం చేయగా జేబులోని కత్తితో భుజంపై మూడుసార్లు పొడిచాడు. దీంతో బాధితుడు రాజ కేకలు వేయడంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కత్తితో దాడి చేసిన సమయంలో ఆ కత్తి ఒరలో ఉందని అదే కనుక ఒరలో నుంచి తీసి నేరుగా దాడి చేసినట్లైతే తీవ్ర ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడదేని బాధితుడు తెలిపాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని వివరించాడు. ఘటనపై జీఆర్పీ పోలీసులు విచారణ చేపట్టారు.

మద్యం సీసాల స్వాధీనం



మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో రూ. 30 వేల విలువైన 155 మద్యం సీసాల్ని సీఐ ఎస్‌.వి. రాజశేఖర్‌రెడ్డి బృందం ఆదివారం స్వాధీనం చేసుకుంది. ఏఎస్‌ఐ మహబూబ్‌ బాషా తెలిపిన వివరాలు.. స్థానిక కిశోర్‌ కాలనీకి చెందిన నాగండ్ల రవికిరణ్‌ బాబు అక్రమంగా మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నాడనే ముందస్తు సమాచారంతో పోలీసులు నిఘా ఉంచారు. అందులో భాగంగా స్థానిక కొణిదెన రోడ్డులో రవికిరణ్‌ బాబును తనిఖీ చేశారు. అతని వద్ద 155 మద్యం సీసాల్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలిగా భవానీదేవి



భవానీదేవి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్‌): స్థానిక అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో ఆదివారం గుంటూరు జిల్లా రచయితల సంఘం అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన విదుషీమణి, ప్రముఖ రచయిత్రి డా.సి.భవానిదేవిని జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నుకున్నట్లు సంఘ జిల్లా ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌.ఎం.సుభాని తెలిపారు. సోమేపల్లి వెంకటసుబ్బయ్య మరణంతో ఖాళీ ఏర్పడిన అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఆమెను ఎన్నుకున్నట్లు చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు జిల్లా రచయితల సంఘం తరపున రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహించాలని సంఘ సభ్యులు కోరారు. ఇటీవల మరణించిన ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నంకు నివాళులర్పించారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు కె.జి.రమేష్‌, కోశాధికారి నానా, సహాయ కార్యదర్శి ఈవూరి వెంకటరెడ్డి, సభ్యులు కొణతం నాగేశ్వరరావు, డా.టి.గోవిందయ్య, తాటికోల పద్మావతి పాల్గొనగా, అధ్యక్షురాలుగా ఎన్నికైన డా.సి.భవానిదేవిని సంఘ సభ్యులు అభినందించారు.

పల్లెకోనలో తైక్వాండో పోటీలు ప్రారంభం

పల్లెకోన(భట్టిప్రోలు): ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు (ఇన్విటేషనల్‌ చాంపియన్‌ షిప్‌-2024) పల్లెకోనలోని పరుచూరి రఘుబాబు, టి. సుబ్బిరామిరెడ్డి లలిత కళా పరిషత్‌ కళా ప్రాంగణంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏబీసీ అండ్‌ ఎఫ్‌ తైక్వాండో క్లబ్‌ (రేపల్లె) కోచ్‌, నేషనల్‌ రిఫరీ ఎ. డేవిడ్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్ని ప్రముఖ పారిశ్రామికవేత్త వేములపల్లి రవికిరణ్‌ ప్రారంభించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. జూనియర్స్‌, సబ్‌ జూనియర్స్‌, క్యాడెట్స్‌, సీనియర్‌, సబ్‌ జూనియర్స్‌ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయి ఎంపికల్లో 180 మంది అన్ని విభాగాల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు నేషనల్‌ ప్లేయర్‌ అండ్‌ రిఫరీలు ఎ. దిలీప్‌, ఎ.చైతన్య, ఎస్‌కే అశ్విల్‌ అహ్మద్‌, యుటీఎఫ్‌ నాయకులు వి.సురేష్‌కుమార్‌ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. తైక్వాండో జిల్లా సెక్రటరీ సుబ్బారావు, స్టేట్‌ అబ్జర్వర్‌ ముఖేష్‌, ప్రశాంత్‌, సర్పంచ్‌ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న శింగరేశ్వర జలపాతం



కొండల పైనుంచి జాలువారుతున్న నీరు

బెల్లంకొండ: తొలకరి వర్షాలు మొదలైతే యువకులు, చిన్నారులలో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తుంది. వర్షాలు ఎప్పుడు పడతాయా... చెరువులు, జలపాతాల వద్దకు వెళ్లి సరదాగా ఎప్పుడు గడుపుదామా అంటూ ఎదురు చూస్తుంటారు. ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తుండడంతో పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామంలోని జలపాతం కూడా ఇదే తరహాలో కనువిందు చేస్తుండటంతో సందర్శకులు పోటెత్తుతున్నారు. శ్రీ కొండ శింగరేశ్వర స్వామి వద్ద గల కొండల మీద నుంచి వస్తున్న నీటితో ప్రకృతి ప్రేమికులు పరవశిస్తున్నారు. దాదాపు 100 అడుగుల ఎత్తైన కొండల పైనుంచి పాల నురగల్లా జాలువారుతున్న నీటిధారలతో జలపాతం అబ్బురపరుస్తోంది. సందర్శకులు దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి జలపాతంలో తడుస్తూ సందడి చేస్తున్నారు.